**1983 ఉగాది కథానికల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ!**

# మధ్యమము

కవనశర్మ



మద్రాసు - కలకత్తా మెయిల్ భీమరాజుని మధ్యలో దింపేసి ముందుకు సాగిపోయింది.

"....పోవుట కిచట బండి మారవలెను" అన్న ప్రకటనని చదువుకొని అతను అటువేపు కదిలాడు.

ప్రతిష్ఠాకరమైన మెయిన్ లైనులో ప్రయాణం మానుకొని, ప్రత్యేకత, వేగం లేని బ్రాంచిలైనులోకి అతను మారాడు. చెట్టుకింద నీడలో వున్న సిమెంటు బెంచీమీద షటిల్ పాసింజర్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

విశాఖపట్నంవైపు నుంచి మరో రైలు వచ్చి వెళ్ళిపోయింది.

"ఏమండీ! పాసింజర్ వెళ్ళిపోయిందా?" కంగారుగా వేసిన ప్రశ్న విని భీమరాజు తలెత్తి చూశాడు. సన్నగా పొడుగ్గా ఉన్న ఒకామె జవాబు కోసం ఆత్రంగా ఎదురు చూస్తోంది

"లేదు" అన్నాడు అనుకోకుండా లేచి నిలబడి.

"అమ్మయ్య! మా రైలు లేటయింది. కనెక్షన్ మిస్సవుతానేమోఅని భయపడ్డాను."

"నేనూ దానికోసమే వెయిట్ చేస్తున్నాను. బాగా లేట్‌గా రన్ అవుతోంది."

ఆమె స్థిమితపడింది. భీమరాజు ఆమెను పరీక్షగా చూశాడు. ఆమె కట్టుకొన్న చీర మీద న్యూటన్స్ రింగ్స్ లాంటి ప్రింట్ వుంది. భుజం చుట్టూ కప్పుకొన్న కొంగు మరుగున సూచనప్రాయంగా లేచెంటు యౌవనం తెలుస్తోంది. ఆమె బొట్టు సీటి బొట్టు లాగా గుండ్రంగా వుంది. ఆమె ఆకర్షణ అందంగాను, గౌరవం కలిగించేలాగాను వుంది. తలకి రాసుకున్న మందార తైలం సర్ఫేస్ టెన్షన్‌కి లొంగక ఒకటో రెండో పలిత కేశాలు తమ వ్యక్తిత్వం నిలబెట్టుకొంటూ నిలబడివున్నాయి. 'ఈమె సింహ మధ్యమ అవునో కాదో కాని మధ్య యౌవని' అనుకొన్నాడు భీమరాజు.

"ఏ వూరు వెళ్ళాలి?" భీమరాజు ఇనర్షియాని అధిగమించి అడిగాడు. ఆగిపోయిన సంభాషణలు కొత్తవిషయాల ప్రోద్బలంతో కాని కదలవు అనే సూత్రాన్ని న్యూటన్స్ ఫస్ట్ లా కి అప్లికేషన్‌గా తీసుకొంటూ.ఆమె చెప్పింది.

"నేనూ అక్కడికే!"

"ఏ ఊరునుంచి వస్తున్నారు?" ఆమె అడిగింది.

"బెంగుళూరు."

ఆమెలో చలనం వచ్చింది. "మా ఊళ్లో మీ కేం పని?" అనుమానంగా అడిగింది.

"అక్కడ కాలేజీలో ఫిజిక్స్ హెడ్‌గా చేరబోతున్నాను."

"అయితే మీరు డాక్టర్ భీమరాజన్నమాట. నేను తెలుగు భారతిని.... అదేనండి అదే కాలేజీలో తెలుగు చెప్పే లెక్చరర్ భారతిని" అంటూ పరిచయం చేసుకొంది.

పాసింజర్ రైలు నిదానంగా వచ్చి ఆగింది. భారతి కిటికీ పక్కన కూర్చుని రాజుకి తన పక్కన చోటుంచింది.

"బెంగుళూరు ఎందుకు వదిలిపెట్టారు? అక్కడి ఉద్యోగం నచ్చలేదా?"

"అక్కడ పని నచ్చింది. కాని ఇక్కడ ఇంకా ఎక్కువ నచ్చుతుందని అనుకొన్నాను."

"మీరు అమెరికాలో పిహెచ్. డి. చేశారటకదా!"

"అవును. మీకు నా గురించి చాలా తెలుసునే! నా బయోడేటా చూశారా?"

భారతి అవునన లేదు, కాదన లేదు.

"కొత్తగా వచ్చే స్టాఫ్ మెంబర్ల గురించి తాజావార్తలు కొన్ని ప్రసారమౌతూ వుంటాయి."

రైలు కూతవేసి బయల్దేరింది.

"ఓ చిన్న ప్రశ్న. వ్యక్తిగతమనుకొంటే జవాబు చెప్పటం మానెయ్యండి. అమెరికా వదలిపెట్టి ఇండియా ఎందుకు వచ్చేశారు? అక్కడ వుండటానికి అవకాశం లేకపోయిందా?"

భారతి ప్రశ్న సూటిగా తగిలింది రాజుకి.

"సెంటర్ ఆఫ్ గ్రావిటీ గుండా దూసుకుపోయింది మీ ప్రశ్న. ప్రయాణం శ్రమ తెలియకుండా మీ ప్రశ్నకి జవాబు చెప్తాను. నేను తొమ్మిది సంవత్సరాల క్రితం ఇండియా వచ్చాను. నేను పిహెచ్. డి. పూర్తయ్యాక గ్రీన్ కార్డు సంపాదించి ఓ లాబ్‌లో పనిచేస్తున్నప్పుడు మా డైరెక్టరు వాళ్ళింటికి పిలిచి భోజనం పెట్టి ఓ మాటన్నాడు. ఆ మాట నన్ను ఆలోచింపచేసింది. ఆలోచించి వెనక్కి వచ్చేశాను. అక్కడ వుండగలిగీ, వుండటానికిష్టంలేక వచ్చేశాను."

"చులకనగా మాట్లాడాడా ఆయన మీ గురించి కాని, మన దేశం గురించికాని?"

"లేదు. ఆయనకి మనసంస్కృతి అన్నా.

వేదాంతం అన్నా గౌరవం. వాటితో ఆయనకి పరిచయం ఉంది. ఇంతకూ ఆయన మన ఋషుల్ని రెండు తెగలుగా విభజించాడు. జనానికి దూరంగా ఉంటూ వాళ్ళ మోక్షం వాళ్ళు చూసుకొన్నవాళ్ళు మొదటి తెగట, తాము సంపాదించినజ్ఞానాన్ని జనానికి పంచిపెట్టినవాళ్ళు రెండవ తెగట. తనకి రెండో తెగే ఆదర్శం అన్నాడు. వ్యాసుడిని ఉదాహరణగా ఇచ్చాడు."

"మనజీవితాలని బాగుచెయ్యాలన్న శ్రద్ధ. కన్‌సర్న్ చూపించినవాళ్ళని మనం ఇష్టపడడం సహజమేకదా! ఆయన మాటలు మీరు ఇండియాకి తిరిగి రావటానికి కారణం అన్నమాట."

"యా! అమెరికాలో వుండిపోతే, నేను నా విజ్ఞానాన్ని బాగా పెంపొందించుకొని విజ్ఞాన శిఖరాలు చేరుకొని పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొనేవాడినేమో! కాని అప్పటికి సంపాదించిన విజ్ఞానం తక్కువే అయినా, చదివినవి కొద్ది చదువులే అయినా వాటిని మన దేశంలో వినియోగించటం నా విధి అనిపించింది. వచ్చేశాను. ఇంతవరకు విచారించలేదు. దేశసేవకు ఉపయోగపడదామనిపించింది."

రైలు ఓ చిన్న స్టేషన్‌లో ఆగింది. సోడాలు అమ్మవచ్చాయి.

"గోలీసోడా ఆంధ్రుల షాంపైన్. నేను తాగుతాను. మీరు తాగుతారా?" అని అడిగాడు రాజు.

భారతి వద్దంది. రాజు ఒకటి తాగి త్రేన్చాడు.

"మనిషి జీవితానికి పరమార్థం చిన్న చిన్న కోర్కెలు తీర్చుకోవటమే అని పూర్వం ఎవరో అన్నారు."

"బహుశ మీరేనేమో" అంది భారతి నవ్వు దాచుకొంటూ.

"కావచ్చు" అన్నాడు రాజు మాయాబజార్లో రామారావులాగా.

"ఇండియా వచ్చారు. తృప్తిగా ఉన్నారు. మరి బెంగుళూరెందుకు వదిలిపెట్టారుట?"

"చేపట్టిన రివర్స్ ట్రాన్సిషన్ మధ్యలో విడిచిపెట్టడం ఇష్టంలేక, మరికొంత ఎఫెక్ట్ చేద్దామని."

"రివర్స్ ట్రాన్సిషన్ ఏమిటి జూటర్ ధమాల్‌లాగా!" అంది భారతి.

"చిన్న ఊరునుంచి పెద్ద ఊరు, చిన్న సంస్థనుంచి పెద్ద సంస్థకి మనుషులు కోరి ప్రయత్నించి మారటం సహజం. అది రెగ్యులర్ ట్రాన్సిషన్! దానికి వ్యతిరేక దిశలో మార్పు జరిగితే, రివర్స్ ట్రాన్సిషన్ అవుతుంది అది."

"ప్రతి మాటకి - ఏదో అర్థం వుంటుంది తెలియాలేకాని!"

"భారతిగారి ఉవాచ?"

"బుడుగు ఉవాచ. మీకు మా ఊళ్ళో చుట్టాలు, బంధువులు, మిత్రులు ఎవరైనా వున్నారా?" అని అడిగింది. లేరని చెప్పాడు.

"మరి ఎక్కడికి వెళ్తారు?"

"ఏమీ అనుకోలేదు. ఈ రైల్లో వస్తున్నట్టు మేనేజిమెంటుకి, ప్రిన్సిపాల్‌కి ఉత్తరాలు రాశాను. జవాబు అందే వ్యవధి లేకపోయింది. వాళ్ళెవరైనా స్టేషన్‌కి వచ్చి బస చూపిస్తారని అనుకొంటున్నాను."

"దానికాధారం?"

"దేశంకాని దేశంలో మా ప్రొఫెసర్ నాకోసం ఎయిర్‌పోర్ట్‌కి వచ్చి నా సామాన్లు మోశాడు. నాకంటూ కుదిర్చిన బసకి తన కార్లో తీసుకువెళ్ళాడు. పరాయి రాష్ట్రంలో ప్లేన్ దిగినప్పుడు పెద్దతలకాయలు నాకోసం రాకపోయినా కారు వచ్చింది. మన తెలుగువాళ్ళకి మర్యాదలెక్కువ కదా! నాకు ఇల్లు దొరికేవరకు ఏదో ఏర్పాటుచెయ్యకపోతారా! ఊరుకి కొత్తవాడినైన నన్ను రిసీవ్ చేసుకోక పోతారా?"

"వస్తారనుకోను. వస్తే వాళ్ళ దర్జా తగ్గిపోతుందికదా!"

"రాకపోతే ఇంటర్వ్యూకి వచ్చినప్పుడు దిగిన లాడ్జి ఉండనే ఉంది. ఊరుదాకా వచ్చి వెనక్కి తిరిగిపోనుకదా!"

భారతి ఊహించినట్టే ఎవరూ స్టేషన్‌కి రాలేదు!

రాజు మర్నాడు కాలేజీకి వెళ్ళి, ప్రిన్సిపాల్‌ని కలిశాడు. ఆయన ఆ రోజు షష్ఠి అని జాయినింగ్ రిపోర్ట్ తీసుకోలేదు. తనకి నమ్మకం లేదన్నాడు రాజు.

"నా కుందికదా! మీతో పోట్లాట నాకిష్టం లేదు" అన్నాడు ప్రిన్సిపాల్.

ఒక రోజులో ఏమైందిలే అని భీమరాజు సప్తమి శుక్రవారం ఉద్యోగంలో చేరాడు.

"ఏరా చిన్నీ! మీ అక్క ఇవ్వాళ సాయంత్రం నేను మీ ఇంటికి వస్తానను కుంటోందా!"



"అవునండీ"

"నీకెలా తెలుసు?"

"ఇందాక హడావిడిగా సినిమా కెళ్ళిపోయిందిగా!"

—కె. మదన్‌మోహన్‌రావ్, విజయవాడ

ఆ రోజు మర్నాడు లాబ్‌తోను, తన జూనియర్స్‌తోను పరిచయం చేసుకొన్నాడు. సాయంత్రాలు నడిచి ఊరు చూడటంతో గడిపాడు. బజారు, సినిమాహాళ్ళు, కాలేజీ, శివాలయం లాంటివి ఎక్కడున్నాయో, ఎలా వెళ్ళాలో తెల్సుకున్నాడు.

అతనికి ఆ ఊరు చాలా నచ్చింది. ఖాళీ స్థలాలుండి చల్లనిగాలి వీచడం, వాతావరణంలో కాలుష్యం లేకపోవడం అతన్ని ఆకట్టుకొన్నాయి. బెంగుళూరులోలాకాకుండా కొనడానికి ఇళ్ళస్థలాలు చవకగాను సులభంగాను దొరకవచ్చు ఈ వూళ్ళో' అనుకొన్నాడు. 'అర్థం లేకుండా పెరిగిపోతున్న సిటీ అది. అదుపులేకుండా ధరలు పెరుగుతున్నాయి అక్కడ. పెరిగే ధరలకు హద్దు లేదు. పెంచే పెద్దలకు బుద్ధి లేదు!' రాజు ఆ ఊరు వచ్చిన మొదటి ఆదివారం ఇల్లా ఆలోచిస్తూ జనసంచారం తక్కువగా వున్న దారిలో నడుస్తున్నాడు. అది ఎటు పోతుందో తెలియదు. అందుకని దారిలో ఓ మనిషి తారసపడగానే, "ఈ రోడ్డు ఎక్కడికి పోతుంది?" అని అడిగాడు రాజు.

"ఎక్కడికి పోవాలి?" అని తిరిగి ప్రశ్నించాడా వ్యక్తి.

"ప్రత్యేకించి ఎక్కడికీ అని లేదు. ఊరికే తిరుగుతున్నాను."

"అటువంటప్పుడు ఈ రోడ్డు ఎటు పోతేయేం!" అని మోటుగా అడిగాడు.

"తెలుసుకొందామని."

"నువ్వెటుపోవాలో తెలియాలిగాని మిగిలినవి ఎటుపోతే నీకేం!"

ఆ వ్యక్తి తన్ను ఏకవచనంలో సంబోధించినందుకు రాజు ఆశ్చర్యపోయాడు. బహుశా తన వేషధారణ సాదాగా ఉండటం వల్ల కావచ్చు, లేక ఆ ఊరి అలవాటు కావచ్చు- అని సర్ది చెప్పుకొన్నాడు.

"బజార్లోకి."

"రిక్షా ఎక్కిపో—నడవటానికి దూరం" అని సలహా ఇచ్చి వెళ్ళిపోయాడు. ఆ ఊరి మీద సదభిప్రాయం కొంచెం సడలింది.

తన ప్రశ్నలకి అవతలివాళ్ళు సూటిగా అడిగిన మేరకు సమాధానం ఇవ్వాలని కోరుకోవడం తన తప్పు. వాళ్ళు తెలిసి తెలియదన్నా, తెలిసి చెప్పమన్నా, నీకెందుకన్నా, భరించడం నేర్చుకోవాలి కాబోలు. తను మారితేగాని తను మార్చలేదు ప్రపంచాన్ని!

భీమరాజు ముందుకు నడిచాడు. ఆ దారి కొత్తగా పెరుగుతున్న కాలనీకి తీసుకువెళ్ళింది. మిగిలిన ఊళ్ళో ఇళ్ళలాగా కాకుండా కాస్త చూడటానికి మోడర్న్‌గా వున్నాయి ఇళ్ళు. ఇల్లాంటి చోట ఓ చిన్న పోర్షన్ సంపాదించగలిగితే బావుండును అని ఆశపడ్డాడు.

"నమస్కారం. ఏమిటిల్లా వచ్చారు!"

రాజు మాట వచ్చినవేపు తలతిప్పి చూశాడు. సన్నజాజి తీగ పక్కన నిలబడి చేతిలో సజ్జతో భారతి కనిపించింది. తెల్ల చీరలో స్వచ్ఛంగా వుంది. కాలేజీలో ఇన్నాళ్ళూ ఆమె కనిపించలేదు.

"రోడ్లు సర్వే చేస్తున్నాను" రాజుకి ఆమె కనిపించడం సంతోషాన్నిచ్చింది.

ఆమె పెదిమల మధ్య చిరునవ్వు మెరిసింది. గేటువద్దకి వచ్చి "లోపలికి వస్తారా?" అని అడిగింది.

"రమ్మంటే వస్తాను."

"రండి" అంటూ లోపలికి దారి తీసింది భారతి.

రాజుని ఓ పెద్ద గదిలోకి తీసుకువెళ్ళింది. అక్కడ కొన్ని పుస్తకాల అల్మారాలు, కొన్ని కుర్చీలు, కుట్టు మిషను, వీణ ఉన్నాయి. రెండు కుర్చీలు ఫాన్ కిందకి లాగి ఫాన్ వేసింది భారతి. గోడలకి బాచీలవారిగా ఫొటోలున్నాయి. మధ్యలో ఓ పెద్ద ఫొటో ఉంది కాన్వొకేషన్ డ్రెస్సులో.

"అది మన ప్రిన్సిపాల్‌గారిది" అన్నాడు రాజు గుర్తుపట్టి.

"మరియు మానాన్నగారిది" అంది భారతి.

రాజు ఖంగుతిన్నాడు. ప్రిన్సిపాల్‌గారు స్టేషన్‌కి రాదు. వస్తేఆయన దర్పా తగ్గిపోతుందిఅని చెప్పిన భారతి ఆయన కూతురా! తమాషా మనిషి. ఆమె చుట్టూ తమాషా అయిన మాగ్నెటిక్ ఫీల్డ్ ఉంది. అందులోకి తను ప్రవేశించాడు. ఆమె తనని ఆమెవైపుకి లాక్కుంటోంది.

భారతి చక్కగా కబుర్లు చెప్పింది. ఆ కబుర్ల మధ్యలో, రాజు, తనకి ఓ చిన్న పోర్షన్ అద్దెకి ఆ పేటలో చూసి పెట్టమన్నాడు.

"ఎంత చిన్నది కావాలి? ఎంత అద్దెలో కావాలి?"

"ఎంతైనా సరిపోతుంది. మూడు వందలలో కావాలి."

"కుటుంబం ఎప్పుడు వస్తుంది?"

"రాదు. లేదు కనక. వంటరివాడిని. వస్తే ఎప్పుడైనా మా అమ్మవచ్చి రెండ్రోజులుంటుంది."

"పెళ్ళి కాకపోతే మూడు వందల రూపాయల అద్దె ఇల్లు ఏం చేసుకొంటారు? ఇక్కడ ఆ అద్దెకి విడి ఇల్లు వస్తుంది. అయినా మీకింకా పెళ్ళికాలేదా?" ఆశ్చర్యంగా అంది భారతి.

"పోనీ వంద రూపాయిలకే ఇల్లు లేక పోర్షను చూడండి. ఇంకపోతే మీకు ఎందుకంత ఆశ్చర్యం నాకు పెళ్ళి కాలేదంటే? నా నుదురు పెద్దది. జుట్టు ఊడిపోయిన బట్టతల అనుకొంటున్నారేమో! నేను నలభై

"ఆ అమ్మాయి నా మీద గాఢమైన ముద్రవేసింది బ్రదర్."

"ఎక్కడా? హృదయం మీదనేనా?"



"కాదు! రైల్లో పై బెర్తు మీద ఆ అమ్మాయి పడుకుంది. క్రింద నేను పడుకున్నాను. పైనించి దిగుతూ గుండెల మీద కాలేసింది- అంతే!"

—కె. మదన్‌మోహన్‌రావ్, విజయవాడ

ఏళ్ళ వాడిలాగా కనిపిస్తాను గాని అంత వయస్సు లేదు. కేవలం ముప్పైతొమ్మిది మాత్రమే!" అన్నాడు రాజు.

భారతి గలగల నవ్వింది. "జోకు బాగానే వుంది కాని ఆడపిల్లకు పెళ్ళి కాలేదంటే సవాలక్ష కారణాలు. అమ్మాయి తెల్లగా వుండకపోవడం, చదువు రాకపోవడం, వచ్చి పెంకెగా కనిపించటం, ఉద్యోగం లేకపోవడం, వుండి నీ లెక్కేమిటీ అన్నట్టు కనిపించడం, ఆమె పేర ఆస్థి లేకపోవడం, ఆమె తండ్రికి డబ్బుండి ఆమెకి అన్నదమ్ములుండటం చేత ఆమెకది దక్కదేమోనన్న అనుమానం అబ్బాయికి వుండటం లాంటివి! కాని మగవాళ్ళకి పెళ్ళి కాలేదంటే ఆశ్చర్యమే! మీలో ఏదో పెద్ద లోపమే వుండి వుండాలి?" భారతి చివరి మాటలు తమాషాగా అన్నా మొదటిభాగం వ్యధతో అన్నది. ఆమె తనకింకా వివాహం కాకపోవడానికి బాధపడ్తోంది అని ఊహించాడు రాజు.

"పెద్ద లోపమే. నా బుద్ధి సరైందికాదు. అందరు ముందుకు పోదాం అంటే నేను వెనక్కు పోదాం అంటాను. నేను అమెరికానుంచి రాగానే ఒకరిద్దరు అమ్మాయిలు నన్ను చేసుకోడానికి ఉబలాటపడ్డారు. అప్పుడు ఇంతకంటే అందంగా వుండేవాడినని అనుకోకండి. నా అందం అప్పుడెలా వుందో- ఇప్పుడూ అలానే వుంది. కాని వాళ్ళతో ఎవరో నేను తిరిగి అమెరికా వెళ్ళనన్న నిజం చెప్పేశారు! దాంతో వాళ్ళ ఉత్సాహం పూర్తిగా డ్రాప్ అయిపోయింది. వోల్టు మీటర్లో రీడింగ్ సున్నా అయిపోయింది. వాళ్ళు అమెరికా వెళ్ళి వుండాలన్న ఆదర్శం కలవారుట. నేను పనికిరాకపోయాను. ఇంకో కాకినాడ అమ్మాయి. తనకి నేను బెంగుళూరులో ఉద్యోగం చూపిస్తే పెళ్ళవగానే ఉద్యోగం మానేసి నాతో వచ్చేస్తానని. లేకపోతే నెలకి, రెండు నెలలకి తనో నేనో సెలవుపెట్టి కల్సుకొంటూఉండాలని షరతు పెట్టింది. నేను కాకినాడలో ఉద్యోగం చూసుకొంటానంటే కాకినాడలో ఉద్యోగస్థులు లేక తను నన్ను చేసుకొంటాననలేదుట. బెంగుళూరుళ్ళో ఉండాలన్న సరదాట. బై మంత్లీ కాపురంకోసం బెంగుళూరులో ఇల్లెక్కడా చూడను! అందుకని చేసుకోలేదు. హాయిగా ఉంటున్నాను. పెద్దగా సామాన్లు జంజాటం పెంచుకోలేదు. కాపీ నమూ లేదు. సంరక్షణా లేదు. దాని కోసం పెళ్ళి చేసుకోవల్సిన అగత్యంలేదు. ఫ్రీ మాలెక్యూల్‌ని."

వీధిలోకి వెళ్ళిన ప్రిన్సిపాల్ ఇంటికి వచ్చాడు. భారతి కాఫీ తెస్తానని లోపలికి వెళ్తుంటే "మజ్జిగ ఇవ్వండి" అన్నాడు రాజు.

ఈ రోజుల్లో ఇంకా మజ్జిగ తాగేవారున్నారా అని ప్రిన్సిపాల్ ఆశ్చర్యపోయాడు.

"సారీ మా ఇంట్లో మజ్జిగ ఇచ్చే ఆచారం లేదు. మీకు అక్కర్లేకపోయినా కాఫీయే ఇస్తాం" అంటూ లోపలికి వెళ్ళింది భారతి.

ప్రిన్సిపాల్ రాజుతో ముభావంగా మాట్లాడాడు. కాఫీ తాగి రాజు సెలవు తీసుకొన్నాడు.

సోమవారం రాజుకి లెక్చర్ వుంది. క్లాను మొదలైన పదిహేను నిముషాలదాకా విద్యార్థులు వస్తూనే వున్నారు. రాజు క్రమశిక్షణ లేందే దేశం బాగుపడదని చెప్పాడు. విద్యార్థులు అవుననలేదు. కాదనలేదు. బెంగుళూరులో రాజు తన స్నేహితులతో చాలాసార్లు ఇండియాస్సు సైన్సులో వెనకబడి వుండటానికి కారణాలు చర్చించాడు. సిలబస్ ఎప్పుటి కప్పుడు మోడర్నైజు చేస్తూనే ఉన్నా, మేష్టర్లు మాత్రం పాతవాళ్ళే. వాళ్ళు కొత్త పాఠాలు చెప్పలేకపోతున్నారు. కష్టపడి ప్రయత్నించడానికి వాళ్ళకి ఇన్సెంటివ్ లేదు. ట్యూషన్స్‌లో ఇన్సెంటివ్ ఉంది. కాని వచ్చేవాళ్ళకి సబ్జెక్టులో ఇంటరెస్టులేదు. వాళ్ళకి మార్కులు కావాలి. పైగా జీవిత విధానంలో సైన్సు ప్రభావం ఎక్కడా కనిపించదు. అందుకనే తమలాంటి వారు గ్రాస్ రూట్ లెవల్లో సైన్సు టీచింగ్‌కి నడుం కట్టుకోవాలి- అని రాజు వాదించాడు. ఇన్నాళ్ళకి అతనికి అవకాశం దొరికింది తన ఆవేశాన్ని ఆచరణలో పెట్టడానికి.

న్యూటన్స్ లాస్ గురించి ఉత్సాహంగా పాఠం చెప్తున్నాడు. ఇంతలో ప్రిన్సిపాల్ గారు రమ్మంటున్నారని కబురు వచ్చింది. క్లాసయ్యాక వస్తానని చెప్పి పాఠం కొనసాగించబోతే ధారతెగిపోయి. మళ్ళీ పుంజు

కోడానికి శ్రమపడాల్సి వచ్చింది.

"కృష్ణారావు కావాలండి" బయట ఓ కుర్రాడు నిలబడి లోపల వున్న ఓ కుర్రాడిని పంపమని అడుగుతున్నాడు. రాజుకి ఒళ్ళు మండి "క్లాసంకో పావు గంటలో అవుతుంది. అప్పుడు కలుసుకో" అని బయటి కుర్రాడివి కేకలువేశాడు. విద్యార్థులు రాజుని ఆశ్చర్యంగా చూశారు. వాళ్ళ కటువంటి అనుభవం లేదు. క్లాసులోకి విద్యార్థులు వాళ్ళ ఇష్టం వచ్చినప్పుడు వస్తూ వుండటం లేనప్పుడు పోతూ వుండటం మామూలు. అంమలో కృష్ణారావు విషయంలో! రాజుగారి కెంతధైర్యం అనుకొన్నారు.

"క్లాసులో ప్రతి నిముషం విలువైనది. దాన్ని దుర్వినియోగంచెయ్యకండి" అన్నాడు రాజు.

"ఇందాకట్నించి మీరే ఈ లెక్చర్తో ఆ పని చేస్తున్నారు" అన్నాడో అబ్బాయి. క్లాసంతా పగలబడి నవ్వారు.

"థాంక్స్. వీటినే భస్మాసురుడి తెలివితేట లంటారు. ఆ మాట లన్నది ఎవరు?" రాజుకోపంగా అడిగాడు. సమాధానం రాలేదా ప్రశ్నకి.

క్లాసయ్యాక ప్రిన్సిపాల్ గదికి వెళ్ళి విద్యార్థుల ప్రవర్తన గురించి చెప్పాడు.

"మీకు కాలేజీ కొత్త. ఇక్కడి పద్ధతులు కొత్త. కొద్ది రోజుల్లో మీరు వాళ్ళకి వాళ్ళు మీకు అలవాటు పడిపోతారు. ఇంతకూ మా అమ్మాయితో మీకో చిన్న పోర్షన్ కావాలన్నారుట. మా మేడమీద రెండు గదులు ఖాళీగా వున్నాయి. పూర్వంవున్న ఆయన నూటయాభై ఇచ్చి వుండేవాడు. సాయంత్రం వచ్చి నచ్చుతుందో, లేదో చూసుకోండి" అన్నాడాయన.

"లాడ్జికంటే ఏదైనా నయమే. సాయంత్రం సామాన్లతో వస్తాను" అన్నాడు రాజు సంతోషంగా. క్లాసులో అయిన గొడవ మర్చిపోయాడు. భారతికి దగ్గరగా ఉండబోతున్నాడు. ఎండి బీటలు వారిన తనజీవితంలో భారతి తొలకరి జల్లు!

ప్రిన్సిపాలింట్లో మేడ మీదకి మారాక రాజుకి సాయంత్రాలు సరదాగా గడుస్తున్నాయి. "మీది నాది ఒకటే వేవ్‌లెంగ్త్. నా ఐడియాస్‌కి మీరు బాగా ట్యూన్ అయ్యారు. బాగా రిసీవ్ చేసుకొంటారు" అని భారతిని మెచ్చుకొన్నాడు.

అర్జెంటుగా ఫిజిక్స్ లాబ్‌కి మెటీరియల్ కావల్సివస్తే, ప్రిన్సిపాల్‌తో చెప్పి ఊళ్ళో దొరికిన షాపునుంచి క్రెడిట్ మీద కొని తెచ్చాడు. అంతకు పూర్వం కాలేజీ అదే మెటీరియల్‌ని కొంచెం హెచ్చుధరకి మరో షాపునుంచి కొంటున్నట్టు తెలుసుకొన్నాడు. తను కొన్న వస్తువుల నాణ్యత కూడా వాటికంటే బావుంది. పదిహేనురోజుల తరువాత షాపు యజమాని కనిపించి తన బిల్లు పాస్ చేయించి డబ్బు జమకట్టే సంతోషిస్తానని చెప్పాడు. రాజు ఆశ్చర్యపోయి ప్రిన్సిపాల్‌ని అడిగాడు. ఆయన,

"ఏమో ఎందుకు పాస్ కాలేదో! ఓసారి మానేజిమెంటువార్ని కలుసుకోండి. ఎందుకైనా మంచిది" అన్నాడు.

"మీ అనుమతి పొందే కొన్నానుకదా! ఇంకెందుకు పెద్దల దర్శనాలు చేసుకోవడాలు?" అని రాజు కొంచెం తీవ్రంగానే అడిగాడు. ప్రిన్సిపాల్ నవ్వాడు. కాని జవాబు చెప్పలేదు.

ఆ సాయంత్రం తన బాధ భారతితో చెప్పుకొన్నాడు. దానికామె "షాపులన్ని చూడ ఒక్క పోలిక నుండు. చూడ చూడ వాటి కథలు వేరు. షాపులందు పెద్దలు మెచ్చు షాపులు వేరయా విశ్వదాభిరామ వినుర భీమ" అంది.

"మీ నాన్నగారే ఆ మాట చెప్పవచ్చుగా!"

"ఆయన సూచించిందేకదా! పెద్దల్ని కలవండి అన్నారు. అంతకంటే రిటైరయి మేనేజ్‌మెంటు దయవల్ల ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న ఆయన ఏమనగలరు! మా నాన్నగారికంటే కమిటీ ఆఫీసులో వుండే హెడ్ గుమాస్తా పవర్‌ఫుల్. లెక్కా జమల్లో చాలా లావాదేవీలుంటాయి!"

"యు మీన్ కిక్ బాక్స్."

"అవి వెనక తాపులో ముందుతాపులో నాకు తెలియవు కాని దేవస్థానాలైనా ప్రయివేటు కాలేజీలైనా వాటి పద్దు పుస్తకాలన్నీ అలికి ముగ్గేసినంత శుభ్రంగా ఉంటాయిట. ఏమైనా మిగుల్చుకొంటే, ఇంకోళ్ళకిచ్చి పుచ్చుకొనే దాంట్లోనే నంటారు మా నాన్నగారు. ఆయన కివి కిట్టవు. కాని ఏమీ చెయ్యలేరు."

"పోన్లెండి మీ నాన్నగారికి అందులో వాటా లేదని తెల్సింది కదా! అది చాలు మనకి" అని తృప్తిపడ్డాడు రాజు.

రాజుకి ఆ కాలేజీలో పద్ధతులు కొన్ని నచ్చలేదు. అందులో లెక్చరర్లు, "మహాప్రభో! మా ఇంక్రిమెంటు బిచ్చం వెయ్యండి" అంటూ ప్రతి సంవత్సరం విన్నపం చేసుకోవాల్సి రావటం. ఆ కాయితం మీద, అయిదారు నెలలకి మేనేజ్‌మెంటు చర్య తీసుకోవడం ఒకటి. ఏ ఖర్చు శాంక్షన్ లేకుండా చెయ్యరాదు అన్న రూలు మొదటిసారి విన్నప్పుడు "అమెరికన్ స్టైల్లో, "ఫెయిర్ ఇనఫ్" అనుకొన్నాడు.

కాని శాంక్షన్ ఎప్పుడూ ఓ జీవితకాలం లేటు అవడం గమనించాడు. ఈ లోపల స్వంతడబ్బులు ఖర్చుపెడ్తే, "నువ్వు డబ్బులో మదించివున్నట్టున్నావు." అని శాంక్షన్ చేయకపోడం గమనించాడు. అందుకని లెక్చరర్లు శాంక్షన్లు వచ్చేవరకు ఏం చేసేవారుకాదు. "వీళ్ళకి ఉత్సాహం లేదు. మేం వీళ్ళకి ఎంతచేసినా వీళ్ళల్లో మార్పురాదు" అని మేనేజ్‌మెంటు మళ్ళీ మేష్టర్లమీద విరుచుకు పడేవారు. ఈ కోల్డ్ వార్‌లో నష్టపడేవారు విద్యార్థులు. మేష్టర్లకి పోయిందేమీలేదు. మేనేజ్‌మెంటుకీ పోయిందీ లేదు.

ఎర్న్‌డ్ లీవు పెట్టిన లెక్చరర్‌కి అది ఎన్నాళ్ళకీ శాంక్షన్ అయేదికాదు. అది శాంక్షన్ అవలేదని ఆ పీరియడ్‌కి జీతం కోసేసేవాడు ముసిలి హెడ్‌గుమాస్తా. "అల్లం శేషగిరిరావుగారి కథలో 'వజిదు' మన హెడ్‌గుమాస్తా" అనేది భారతి; రాజు చేత ఆ 'ముసలి నక్కకథ' చదివించింది ఆమె.

ఆదివారాలు, సెలవలు అని లేకుండా.

## జోకు!

టింగ్.. టింగ్...
పళ్ళమధ్యా ఇరుక్కున్న
ఆహారపు అణువుల వల్ల
అనారోగ్యం సంభవిస్తుంది!
ఫలానా టూత్ పేస్ట్ వాడండి!
టింగ్... టింగ్...
పళ్ళ మధ్యా ఇరుక్కోడానికి
ఆహారపు అణువు లేవీ?



— తనికెళ్ల భరణి

ఈ పని ఆ పని అని లేకుండా మేనేజ్‌మెంటు పనిచేయించేది మేష్టర్లచేత. రాజు, "నేనిక్కడ ఇమడలేను. రిజైన్ చేసి వెళ్ళిపోతాను" అన్నాడు రెండు మూడుసార్లు ప్రిన్సిపాల్‌తో.

"మీకేమైనా ప్రివిలేజెస్ కావాలంటే మీకు స్పెషల్‌గా మేనేజ్‌మెంటుతో చెప్పి కల్పిస్తాను. హక్కులంటే ఇక్కడ ఒప్పుకోరు. తరువాత, ఇక్కడ మిగతా స్టాఫ్ అంతా ఈ పద్ధతికి అలవాటుపడి తలవంచి పనిచేస్తున్నారు. వాళ్ళని రెచ్చగొట్టవద్దు" అన్నాడాయన. ప్రిన్సిపాల్‌ది 'స్టేటస్‌కో' పద్ధతి. మార్పు తేవటానికి ప్రయత్నించడు.

ఒక డైనమిక్ ఈక్విలిబ్రియమ్‌కి ఇక్కడి సిస్టమ్ రీచ్ అయింది. దీన్ని కొత్త, ఇంతకంటే మంచి ఈక్విలిబ్రియమ్‌కి తీసుకువెళ్ళాలంటే చాలా కష్టపడాలి! ఆ మాటే భారతితో అంటే,

"ప్రారబ్ధగ్నము నుజ్జగింపరు, విఘ్నవిహన్యమానులగుచును ప్రజ్ఞా విధులైన ధీరులు" అన్న సుభాషితం విని ఉంటారు కదా. మీ ప్రయత్నాలు మీరు మానకండి" అని ప్రోత్సహించింది.

రాజు లెక్చెరర్లతో మాట్లాడి కొన్ని మార్పులు సూచించాడు. ఎక్కువమంది "ఇప్పుడు మనం సుఖంగానే ఉన్నాం కదా!" అన్నారు బెదురుగా. వాళ్ళ వెన్నెముక ఎప్పుడో శిధిలావస్థ పొందింది. గాంధీ భయాన్ని విడిచిపెట్టమని చెప్పి చెప్పి చచ్చిపోయాడు. గాంధీ పోయాడు కాని భయంపోలేదు.

"నేనిక్కడికి విద్యార్థులకోసం వచ్చాను. వాళ్ళు ఉత్తమ శాస్త్రజ్ఞులు అవటానికి కావలసిన శాస్త్రీయ దృక్పథం ఏర్పరుచుకోడానికి నా శాయశక్తులా శ్రమిస్తాను" అనుకొన్నాడు రాజు.

తన ధ్యేయం కోసం మిగిలిన వాతావరణంతో రాజీపడదలచుకొన్నాడు. వాళ్ళకే అక్కర్లేని వాళ్ళ హక్కుల గురించి తను పోట్లాడలేడు తుది దాకా. ఈ విషయంలో తనది మిడిల్ డ్రాప్.

నవంబర్ నెల చిరుచలిని తెచ్చింది. చిరుచలి వెచ్చని ఊహల్ని తెచ్చింది. ప్రిన్సిపాల్ ఒక రోజున, "మా అమ్మాయి భారతిని మీకు పెళ్ళి చేసుకోవాలని కోర్తున్నాను" అన్నాడు భీమరాజుతో.

"నేనే ఆ విషయం ఎత్తుదామని అనుకొంటున్నాను. మీతో అని భారతిగారితో అనాలా, లేక ఆవిడ అభిప్రాయం తెలుసుకొని మీతో చెప్పాలా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో మీరే అడిగారు ఆవిడ అభిప్రాయం కూడా అదే అయితే వాట్ ఆర్ వుయ్ వెయిటింగ్ ఫర్?" అన్నాడు భీమరాజు.



జడ్జి : మీ జంట చాలా చూడముచ్చటగా వుంది. మీరెందుకు విడాకులు తీసుకోదల్చుకున్నారు?

భర్త : మా ఇద్దరి అభిరుచులు పూర్తిగా భిన్నమైనవి యువరానర్. నాకు ఆడవాళ్ళంటే ఇష్టం. ఆమెకి మగవాళ్ళంటే ఇష్టం.

—కె. మదన్ మోహన్‌రావ్, విజయవాడ

భార్య :- ఇంటి ముందెవరో బిచ్చగాడు అరుస్తున్నాడండీ.

భర్త :- కాస్త అన్నం పెట్టి పంపించు.

భార్య :- ఆయనెవరో బాగా బ్రతికి చెడినవాడిలా వున్నాడండీ.

భర్త :- అయితే అన్నం వెండికంచంలో తీసుకొని వెళ్ళి పెట్టిరా.

—సుజయ్‌శ్రీ. ఆదోని

కాలేజీలో అందరికి భారతి, రాజు కాబోయే దంపతులు అని తెలిసిపోయింది. రాజుకి, ప్రిన్సిపాల్‌కి కాబోయే అల్లుడిగా తద్వారా మేనేజ్‌మెంటుకి కావలసినవాడిగా గుర్తింపు వచ్చింది. వెన్నెల్లో భారతితో మేడమీద కబుర్లు చెప్పుకుంటుంటే మధురమైన అనుభవాల వల్ల రాజుకావూరు చాలా ఆకర్షణీయంగా, అందంగా కనిపించింది. భారతితో చూసే సినిమాలు బావుంటున్నాయి. కాగే సోడాలు రుచిగా ఉంటున్నాయి. భారతి రాజుతో తెలుగు, రాజు భారతితో ఫిజిక్స్ మాట్లాడేసుకొంటున్నారు. పిదతకింద పవ్వు వంచుకొంటూ ...

ఊరుకి పదిమైళ్ళ దూరంలో నది. నది ఒడ్డున గుళ్ళు వున్నాయి. ఆ గుళ్ళో దేవుడు రుక్మిణీనాథుడైన కృష్ణుడు. ప్రేమికులు ఆ గుడికి వెళ్ళి దణ్ణాలు పెట్టుకొంటే, వాళ్ళకి పెళ్ళయి తీరుతుందని భారతి చెప్పింది.

"లేకపోతే అవదా?"-రాజుకి గుబులు. గోపురాల నవ్వు.

"వెళ్తే నష్టం లేదు కదా! పైగా పిక్నిక్‌లా వుంటుంది. నదిలో స్నానం సరదాగా వుంటుంది, పెద్దగా జనం వుండరు. ప్రశాంతంగా వుంటుంది" అని బతిమాలింది భారతి.

"ఓకే మీ రంతగా వెళదాం అంటే వెళదాం" అన్నాడు.

సెలవు రోజున బుట్టలో తిండి సర్దింది. సంచీలో పట్టుచీర, పట్టు రవిక పెట్టుకొంది. స్నానం చెయ్యడానికి వీలైన నూలు బట్టలు కట్టుకొంది. రాజు కాకిరంగును పోలిన రంగు బట్టలు టవ్ లుకింగ్‌ని వేసుకొన్నాడు. అతని మధ్యపాపిడి, ఉంగరాల జుట్టు, భుజంమీద రెక్కలున్న చొక్కా, ముతక జీన్సు, వెడల్పు బెల్టు, నెరిసిన మొగ చంపలు చూసి భారతి వేషం సిపాయిలవేషం నిండుమనంబు మాత్రం నవ్య నవనీత సమానం అనుకొని నవ్వుకొంది.

బస్ స్టాండులో భుజాన్ని స్విమ్మింగ్ ట్రంకు, తువ్వాలు పెట్టుకొన్న సంచీతో నిలబడ్డ రాజుని,

"ఈ బస్సెక్కడికి వెళ్తుంది?" అని అడిగాడో పల్లెటూరి ఆసామి.

రాజు బోర్డుచూసి చెప్పాడు. "నువ్వెక్క

"ఎందుకు?"

వాళ్ళెందుకు-
ఉరి తీశారు?
హత్యలు చేశారా?
మానభంగాలు చేశారా?
దోపిడీలు చేశారా ......
..............
ఇవేమీ చేయలేదు గానీ-
"ఎందుకు?"
అని ప్రశ్నించటం
నేర్చుకున్నందుకు!



— తనికెళ్ళ భరణి

దకు వెళ్ళాలి" అని అడగలేము.

"ఓ టిక్కెట్టియ్యండి" అని అడిగాడు ఆ ఆసామి రాజుని.

ఆ ఆసామి రాజుని కండక్టర్‌గా పొరపడ్డందుకు భారతి నొచ్చుకొంది. కాని రాజు మాత్రం శాంతంగా, అవతలవాడి అమాయకత్వానికి కోపగించుకోక.

"టిక్కెట్లు వేరే కండక్టరిస్తాడు" అని అతన్తో చెప్పి "నా బట్టలుచూసి కండక్టర్ ననుకొన్నాడు పాపం" అన్నాడు భారతితో.

బస్సులో భారతి పక్కన ఆమె తల వెనుకగా సీటంబడి అతని చెయ్యి చాచి కూర్చున్నాడు. ఆ చెయ్యి చాపటం ఆమె నా రక్షణలో వుంది అన్నట్టుగా వుంది. మనసిచ్చిన మగవాడి తియ్యటి రక్షణ కలిగించే గర్వాన్ని జీవితంలో మొదటిసారిగా భారతి అనుభవించింది.

గుడికి కొంచెం దూరంగా, జనం పెద్దగా లేని నదిలో స్నానానికి దిగారు ఇద్దరూ. ఒకళ్ళ మీద ఒకళ్ళు చిన్న పిల్లల్లాగా నీళ్ళ జల్లుకొన్నారు. చేతులు పట్టుకొని సరిగంగ స్నానం చేశారు. రాజు ఈదటం మొదలు పెట్టాడు. భారతి ఒడ్డెక్కింది.

వంటి కంటుకొన్న బట్టల్లోంచి అందమైన వంపులు తెలుస్తున్నాయి. రాజు ఈత ఆపి ఆమెనే తన్మయత్వంతో చూడటం మొదలుపెట్టాడు. ఆమె బట్టలు మార్చుకొంటుంటే బహిర్గతమైన అందాల మెరుపులు మురిపించగా, నీటిని వదిలి ఆమెను జేరి, "మీరు చాలా అందమైన వారు" అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని ప్రేమగా నొక్కాడు.

"అతిశయోక్తులు వాస్తున్నారు" అంది ఆమె సిగ్గు ప్రదర్శిస్తూ- అతను తన అందాలు గమనించినందుకు సంతోషిస్తూ.

"ఎగ్జాజిరేట్ చెయ్యడానికి నేను ఆంప్లిఫయర్ని కాను. రిసీవ్ చేసుకొన్న అందాల సిగ్నల్‌ని మాటల్లోకి మార్చడంలో హైఫిడిలిటీ ఉన్న మనిషిని" అన్నాడు.

"శృంగారానికి తెలుగునే వాడవలెను."

"అయినచో వినుడు. నదులకి గుళ్ళకి కొన్ని ప్రయోజనాలున్నాయని మీరు బట్టలు మార్చుకొంటుండగా మొదటిసారి తట్టింది."

ఆ మాటలకి సిగ్గుతో ఎర్రబారాయి భారతి బుగ్గలు.

గుళ్ళో దర్శనం చేసుకొన్నాక చెట్టు నీడన భారతి తెచ్చిన భోజనం ఇద్దరు తిన్నారు. ఆపైన విశ్రాంతిగా కబుర్లు చెప్పుకొంటూ త్వరలో పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకొన్నారు.

తిరుగుప్రయాణం పూర్తి చేసి బస్సుస్టాండులో దిగేసరికి అక్కడంతా నిర్జీవంగా కనిపించింది. షాపులు మూసేసి ఉన్నాయి. ప్రహరీగోడ దగ్గర గుడ్డతో కప్పిన శవం ఉంది. అక్కడ నిలబడివున్న ఒకతన్ని "ఏమైంది" అని అడిగాడు రాజు.

"ఎవరో చచ్చిపోయారు" అని జవాబు చెప్పాడతను.

"అది తెలుస్తూనే వుంది. ఎల్లా చచ్చిపోయాడు?" అని అడిగాడు రాజు. అతను రాజు కాకీ రంగులాంటి బట్టలను ఒకసారి పరీక్షగా చూసి,

"నాకుమాత్రం ఏం తెలుసు!" అని అక్కడనుంచి తప్పుకొన్నాడు.

'గొప్ప ఊరు! తెలుస్తున్నదే చెప్తారు. తెలియవలసినది చెప్పరు' అనుకొన్నాడు రాజు.

మర్నాడు కాలేజీకి వెళ్ళేసరికి అక్కడ పోలీసువాన్ కనిపించింది రాజుకి "ఎందుకు వచ్చిందీ వాన్?" అని రాజు కొందరిని అడిగి చూశాడు కాని ఎవరూ సరిగ్గా సమాధానం చెప్పలేము.

ఇంటి దగ్గర ప్రిన్సిపాల్ చెప్పాడు: రాజు కాలేజీలో చేరకముందు కాలేజీలో ఎన్నికలయ్యాయి. ఆ ఎన్నికల్లో కృష్ణారావు కులం వారు ఓడిపోయారు. గెలిచిన కులం వాళ్ళు ఎన్నికల్లో గెలవటానికి కారణం ఊళ్ళో నుంచి రౌడీలను పిలుచుకువచ్చి వాళ్ళ తరపున ప్రచారం చేయించటం. విద్యార్థులను బెదిరించటం. బస్సుస్టాండులో రాజు చూసిన శవం ఆ రౌడీలలో ఒకళ్ళది. కృష్ణారావు కులంవాళ్ళకి, కృష్ణారావుకి ఆ హత్యతో సంబంధం వుందని పోలీసుల అనుమానం. క్లాసులకి తిన్నగా వచ్చే అలవాటు లేని కృష్ణారావు వాళ్ళకి దొరకలేదు. పట్టపగలు బస్సుస్టాండులో హత్య జరిగినా దానికి ప్రత్యక్ష సాక్షులు లేరు! అంతకంటే వున్నా ముందుకు రాలేదన్నది నిజం. పాతికేళ్ళ నుంచి రగులుతున్న పాత పగలవల్ల. ఆ క్రైముకి ఊళ్ళో లేకపోయినా చూసినట్టు సాక్ష్యం చెప్పడానికి జంకనివాళ్ళు లేకపోలేదు!


కొద్ది రోజులకి కృష్ణారావు అరెస్టయ్యాడన్నారు. జనవరి నెలలో క్లాసు పరీక్షలకి పోలీసు ఎస్కార్టుతో హాజరయ్యాడు. విద్యార్థులు కొందరు తనకి హీరోస్ వెల్కమ్ ఇచ్చారు. ఫిబ్రవరి నెలలో అతను బెయిల్‌మీద విడుదల అయి క్లాసులకి రావటం మొదలు పెట్టాడు. ఈ విషయాలు రాజుని కలవరపెట్టినట్లుగా ఎవరినీ పెట్టలేదు. విద్యార్థుల ఎన్నికల కారణంగా అడపాతడపా హత్యలుజరగటం మామూలేనని తెలిసింది.

పరీక్షలు దగ్గరపడటంతో కొందరు విద్యార్థులు రాజుని ట్యూషన్ చెప్పమని కోరారు. "మీరు ముందర మీ అంతట మీరు పాఠాలు చదవండి. సందేహాలు వస్తే నన్ను కాలేజీలో కాని, ఇంటి దగ్గర గాని అడగండి, తీరుస్తాను. నేను స్పూన్‌ఫీడింగ్ మాత్రం చెయ్యను" అని ఖచ్చితంగా చెప్పాడు రాజు. ఒకరిద్దరు స్వంతంగా కష్టపడి చదివే విద్యార్థులు మాత్రమే రాజునడిగి సందేహాలు తీర్చుకొన్నారు.

పరీక్షలింకా రెండురోజులున్నాయనగా ప్రశ్నాపత్రాలు యూనివర్సిటీనుంచి మెసెంజర్ ద్వారా వచ్చాయి. "పేపర్లు ఔట్ అవకుండా ఇది మంచి పద్ధతే!" అన్నాడు రాజు భారతితో.

"మంచి పద్ధతేనేమో! కాని ఈ పద్ధతిలో తెచ్చినతనకి తెచ్చినందుకు డబ్బు ముడుతుంది. పోస్టులో పంపితే ముట్టదు. అందుకు అతను స్వయంగా డెలివరీ చెయ్యటానికి శ్రమపడ్డాడు" అంది ఆమె.

కోలాహలంగా పరీక్షలు మొదలయ్యాయి. రాజు కాపీ కొడ్తున్న వాళ్ళనిద్దర్ని పట్టుకొన్నాడు. ప్రిన్సిపాల్ వచ్చి వాళ్ళిద్దరి దగ్గర సేట్‌మెంట్లు పుచ్చుకొని, వాళ్ళని



పరీక్ష వ్రాయనీయకుండా బయటకు పంపించేశాడు. యూనివర్సిటీ నుంచి పరీక్షలు సవ్యంగా జరిగేలాగా చూడటానికి పంపబడ్డ పర్యవేక్షకుడు ఇంగ్రెస్ అయ్యాడు. రాజు మిగిలిన వాచర్స్‌లా కాకుండా తను స్ట్రిక్టుగా వున్నందుకు కొంచెం గర్వపడ్డాడు.

మరునటిరోజు మరో గదిలో రాజు ప్యూటీ పోయాడు. అందుచేత ఎవరికీ కాపీకొట్టే అవకాశం రాలేదు. పరీక్షంతటా ఏమీ వ్రాయని ఓ విద్యార్థి పరీక్ష చివర, జవాబులు వ్రాసి ఉన్న ఎడిషనల్ షీట్సు ఏవో గిలికి కొట్టేసి ఉన్న మెయిన్ ఆన్సర్ పుస్తకానికి కట్టి ఇస్తుంటే ఆశ్చర్యపోయాడు. అతను ఎడిషనల్ షీట్సు అడగలేదు. అతనిచ్చిన కాయితాలు పరీక్షగా చూస్తే మెయిన్ బుక్‌లో దస్తూరీ, ఎడిషనల్ కాయితాల్లో దస్తూరి ఒకటి కాదు. రాజు ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చేశాడు. ఆయన, "మీది అనుమానం మాత్రమే" అన్నాడు. అబ్జర్వర్ అయిపులేడు. పది కాలేజీలకి తనొక్కడే అబ్జర్వర్.

అక్కడాఇక్కడావుండటానికి అతను కృష్ణ పరమాత్మలాగా చిద్విలాసుడు కాదుకదా! అతని దృష్టికి వచ్చిన అన్యాయాల్ని శిక్షిస్తాడు. న్యాయం జరుపుతున్నట్టు కనిపిస్తాడు. ఆ క్షణాన అతనక్కడలేడు. రాజు ప్రిన్సిపాల్ సలహాను పాటించక ఆ విద్యార్థి పేరు మాల్‌ప్రాక్టిసెస్ చేసిన విద్యార్థుల పేర్లలో చేర్చాడు. ఆ విద్యార్థికి ప్రశ్నలు ముందే ఎలా తెలిశాయి? అవి వ్రాసుకురావటానికి ఎడిషనల్ షీట్సు ఎలా అందాయి? అన్న ప్రశ్నలు సహజంగా ఎవరైనా అడుగుతారని, అవి ఆన్సర్ చెయ్యటం కాలేజీ మేనేజ్‌మెంటుకి అవమానకరమని, ఈ గొడవవల్ల కాలేజీకి చెడుపేరు వస్తుందని, అందుకని రాజుని ఆ కేసు విషయంలో పట్టుదల విడిచిపెట్టమని కబురుపెట్టారు. రాజు తన పట్టు వదల్లేదు.

ఆ రాత్రి "మీరిల్లా మడికట్టుకొని కూర్చుని ప్రమాదాలు మీదికి తెచ్చుకోకండి" అని ప్రిన్సిపాల్ మందలించాడు. "ఈ అబ్జర్వర్ యూనివర్సిటీ నుంచి టియ్యే తీసుకొని కూడా మనచేత టిక్కెట్లు కొనిపిస్తాడు. అతను మనం చెప్పినట్టు వింటాడు, నా మాట వినండి" అని బతిమాలాడు. రాజు వినలేదు.

మనసు బాగాలేక రాజు వీధిలో తిరిగి రావటానికి బయటకు పోయాడు. కాలేజీకి కొద్ది దూరంలో, "మావాడిని పట్టుకోవడానికి నీ కెన్నిగుండెలు" అని రాజుని కొందరు అటకాయించారు.

రాజు "మీరెవరుకీమీ కేం సంబంధం?" అని అడిగాడు. వాళ్ళు చొక్కా దొరక పుచ్చుకొని ఆ చెంపా, ఈ చెంపా వాయించారు. రాజు పౌరుషంగా ఎదురు తిరిగాడు. ఒకడు ఇనుప చువ్వతో రాజు తలమీద కొట్టాడు. రాజు "అమ్మా" అంటూ నేలమీద కూలబడ్డాడు. తిరిగి అతనిమీద దెబ్బ పడే అంతలో, "ఎవడ్రా మా మేష్టారుగారుమీద చెయ్యి చేసుకుంటున్న మొగాడు!" అంటూ ఎక్కడ్నుంచో కృష్ణారావు బృందంవచ్చి వాళ్ళమీద కలియబడ్డారు. వాళ్ళు పారిపోయారు.

"లెండి మేష్టారు. మీకీ వూరు సంగతి తెలియదు. మీరివాళపట్టుకొన్నవాడు మా అపొజిషన్ గ్రూపువాడు. వాళ్ళకి మన కాలేజీ మేనేజ్‌మెంటు సపోర్టు ఉంది" అని కృష్ణారావు రాజుని లేవదీశాడు. రాజు కారుతున్న రక్తాన్ని తుడుచుకొని ఇంటివేపు నడిచాడు. కృష్ణారావు బృందం రాజు నింటిదాకా దింపారు. దార్లో ట్యూషన్స్ చెప్పే మేష్టర్లలో కొందరు క్వెశ్చన్ పేపర్లు సంపాదిస్తారని, కొందరు గుమాస్తాలు ఎడిషనల్ షీట్సు అమ్ముతారని చెప్పాడు కృష్ణారావు.

రాజుకు తల తిరిగిపోయింది. విద్యార్థులలో ఏ దన్నూ లేని విద్యార్థుల అక్రమ ప్రవర్తన దండింపబడగా బలవంతులైన విద్యార్థులు ఏం చేసైనా తప్పించుకొంటున్నారు. ఈ విద్యాసంస్థలు కుళ్ళిపోయాయి. ఇవి బాగుపడాలంటే కమ్యూనిస్టులు కోరే విప్లవమన్నా రావాలి, లేక పురాణాల్లో చెప్పే అవతార పురుషుడివల్ల ధర్మసంస్థాపనన్నా జరగాలి. నావల్ల కాదని నిస్పృహతో రాజు రిజైన్ చేశాడు. "నా పేరే భీమరాజు. మహాప్రస్థానం మధ్యలో పడిపోయే జాతివాడిని" అన్నాడు సెల్ఫ్ పిటీతో.

"మీరు ఉత్తములుకారని చింతించకండి. మంచికిపూనుకొంటే ఇబ్బందుల నెదుర్కోవల్సి వస్తుందని జడత్వంతో బతికే మా కంటే నయం" అన్నాడు ప్రిన్సిపాల్ ఓదారుస్తూ "మీరు కనీసం ప్రయత్నించారు."

"మీకు బెంగుళూరులో ఇంకా ఉద్యోగం వుందిగా— ఇల్లు చూసుకొని ఉత్తరం రాయండి. ముహూర్తం పెట్టుకొందాం" అంది భారతి అతని తలకి కట్టు కడ్తూ.

'యా! నేను కనీసం ప్రయత్నించాను' అనుకొన్నాడు రాజు.

రాణి: రాజూ! నన్ను పెళ్ళి చేసుకో. నీ కష్టాలు, బాధలు అన్నీ నేను కూడా పంచుకుంటాను.




రాజు: కానీ, నా కే కష్టాలు, బాధలూ లేవే!

రాణి: నే చెప్పేది పెళ్ళయిం తర్వాత సంగతి.

ఓ వయసు మళ్ళినావిడ స్టూడియో కెళ్ళి ఫొటో తీయించుకుంది. తర్వాత తన ఫొటో చూసుకుని, సంతృప్తిపడక, ఫొటో గ్రాఫర్‌తో "మీరు నా ఫొటో విషయంలో సరైన న్యాయం చేయలేకపోయారు" అంది.

"నిజమే! పదేళ్ళ క్రితం అయితే చేయ గలిగివుండేవాణ్ణి" అన్నాడు ఫొటో గ్రాఫర్.

—కె. మదన్ మోహన్‌రావ్, విజయవాడ


ఆంధ్రుల అభిమాన రచయిత్రి

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి నవలలు!

| | | | |
|---|---|---|---|
| హృదయగానం | 22—00 | స్నేహమయి | 12—00 |
| మధుర స్వప్నం | 16—00 | సంసార రథం | 10—00 |
| దాంపత్య వనం | 15—00 | రాధాకృష్ణ | 13—00 |
| నీరాజనం | 16—00 | కీర్తి కిరీటాలు | 20—00 |
| సహజీవనం | 15—00 | ప్రేమ లేఖలు | 20—00 |
| అనురాగ తోరణం | 10—00 | పార్థు | 12—00 |
| ప్రేమ సింహాసనం | 18—00 | సీతాపతి | 15—00 |
| | | ఈ దేశం మాకేమిచ్చింది? | 15—00 |

మీకు కావలసిన పుస్తకాల ధర M.O. పంపండి. రు. 2/-లకు V.P. పెట్టి పంపుతాము.

క్వాలిటీ పబ్లిషర్స్, రామమందిరం వీధి, విజయవాడ-2